
కథ



# అంజనసిద్ధుడు

-వేంపల్లి గంగాధర్

"మూడేపమాన్ల సత్రం కాన్నుంచి కాలి దావన పడమటి దిక్కుకు బసవేశ్వరుడి దేవళం వైపుకు రాళ్ల గుట్ట దాటుకున్యాక అట్నే అట్నే కవ్వంకోన కాడుండే పెన్నేరు దాటుకోవాల. ఆన్నుంచి తూర్పుకు దిగితే ఎగువ బండకు అవతల నాలుగు యాపచెట్లు, పది తుమ్మ చెట్లు వస్తాయి. ఆ వనంలో నెమరేసుకుంటూ జోగుతావుండాయి మీ ఆవులమంద. పోయి ఇంటికి తోలుకచ్చుకోపోల్లి...' ఎర్రటికళ్లను నులుపుకుంటా తల విదిలించు కొని సూసి జెప్పినాడు అంజనం లోంచి తిరుమలయ్య.

సంతృప్తిగా తల వూపినాడు, ఎదురుగా యాపాకు కొమ్మలు తిప్పుతా మంత్రాలు చదువుతావుండే అంజన సిద్ధలయ్య.

నాల్గురోజుల్నుంచి చుట్టుపక్కల పదారు పల్లెల్ని జల్లెడ పట్టి విసిరి వేసారి కాళ్లీడ్చుకుంటూ సిద్ధులయ్యను కలిసి తన ఆవుల మంద దారి తప్పిన సంగతిని గోడుగోడుగా చెప్పి దుఃఖించినాడు వీరారెడ్డి.

అమావాస్యనాడు నీలికళ్ల తిరుమలయ్యను నట్టింట్లో వేసిన స్త్రీ చక్రం ముగ్గులో కూర్చోబెట్టి తప్పిపోయిన ఆవుల మంద యాడుందో గుర్తించినాడు సిద్ధులయ్య ఇలా! పల్లెంలో ఆకు, వక్క జత కొత్తగుడ్డలు, నూటా పదార్లు లెక్కపెట్టి సిద్ధులయ్య కాళ్లకు నమస్కారం చేసుకున్నాడు వీరారెడ్డి. ఆన్నుంచి అట్నే కవ్వంకోన దిక్కుకు తన ఆవుల మందను తోలకచ్చుకోను బిరబిరా అడుగు లేసుకుంటూ వెళ్లిపోయాడు.

000

అంజనం పల్లెవూరు కాదు. ఇళ్లు గూడా ఏమీలేవు. రావిచెట్టు, యాపచెట్టు పెనవేసుకొని ఉండే స్థలంలో రాయల కాలం నాటి కావలి సత్రం వొకటి ఉండేది. ఎప్పుడో పాతకాలమప్పుడు అంజన మేసేవాళ్లంతా ఆ సత్రం కాడ వుండేటోళ్లంటారు. హిరణ్యరాజ్యంలో ఎక్కడ ఏం జరిగినా జనమంతా ఇక్కడికి వచ్చి, తమకు కావల్సిన సమాచారం తెలుసుకొని పోతావుండేటోళ్లని పెద్దాళ్లు చెప్తావుంటారు. ఆ సత్యం ఉండే ప్రాంతాన్ని అంజనపల్లె అని పిలుస్తావుండారిప్పుడు.

నలభై ఏళ్ల క్రితమైతే పక్కీరయ్య అనే అంజనమేసే పెద్దాయన ఆ సత్రం కాడ్నే ఉండేటోడు. మనిషి ముసిలోడు. గెడ్డం, మీసాలు పెంచుకొని ఎర్రటిగుడ్డలు కట్టుకొని శరీరమంతా బూడిద పూసు కొని ఎప్పుడూ సత్రం అరుగు మీద మంత్రాలు సదువుకుంటూ కళ్లు మూసుకొని మనోనేత్రంతో సకలం తెలుసుకుంటూ ఉండేటోడు.

ఆ పెద్దాయనంటే అందరికీ గౌరవం. భక్తిభావం. చుట్టుపక్కనుండే పల్లెల్నుంచి జనం ఎప్పుడూ అంజనం పల్లెకు వస్తావుండేటోళ్లు... వాళ్ల వాళ్ల కష్టాల్ని మూట కట్టుకొని! పెద్దాయన ఓపిగ్గా విని ఎట్టోగొట్టా వాళ్ల కష్టం తప్పించి వచ్చినోళ్లను ఆనందంగా వెనక్కి పంపేటోడు.

'పక్కీరయ్య మంత్రం కడితే ఎట్టాట్టి పీడదోషమైన ఎగిరిపోతా'దని జనం అనుకుంటావుండిరి.

శింగనమల నుంచి పాపిరెడ్డి పెద్దకోడలు లక్షుమ్మను ఓ దినం అంజనం పల్లెకు పిల్సుకొచ్చినారు.'కోళ్లికి దెయ్యమేదో పట్టిందని, సగరప్రొద్దున లేసి నట్టింట్లో జెగ్గినక తొక్కుతాందని, మనిషి పట్టుకోబోతే మింగుతానని కండ్లు ఎర్రగా జేసుకొని తలాడిస్తా భయపడిస్తా వుండాదని, తలను బండకేసి బాదుకుంటా ఏడుస్తా వుండా'దని... ఆయమ్మి చేస్తాండే చేష్టలన్నీ ఒక్కొక్కటిగా పక్కీరయ్య కు చెప్పుకొచ్చినారు.

అంతా ఓపిగ్గా వినిన తర్వాత, ఆదివారం అమావాస్యనాడు వూరి

పొలిమేరలోని శ్మశానంలో ముగ్గు వేసినారు. పక్కీరయ్యకు ఎదురుగా లక్ష్మమ్మ కూర్చోని ఎంట్రుకలు విరబోసుకొని తల గిరగిరా తిప్పుతూ వుండాది.

'రా...రా... నా కొడుకా... నిన్ను అరికాలి కిందవేసి నలుస్తా...రా!' అని ఆయమ్మి పళ్లు పటాపటా కొరుకుతా తిడతా వుండాది.

ఆయమ్మిని ఒక ప్రక్క సిద్ధులయ్య, మరో ప్రక్క తిరుమలయ్య పట్టుకొని వుండారు. వీరిద్దరూ పక్కీరయ్యకు ఇష్టమైన శిష్యులు. అందుకే పక్కీరయ్య తనకు తెల్సిన విద్యలన్నీ వీళ్లిద్దరికీ నేర్పించాడు.

పక్కీరయ్య చేతిలో యాపాకు మండలు తిరుగుతా వుండాయి. నోటి నుంచి మంత్రాలు అనర్గళంగా వస్తానే వుండాయి. దూరం నుంచి ఆయమ్మి అత్త, మామ, మొగుడు చూస్తా వుండారు, భయం భయంగా!

విభూది, ఎర్రకుంకం తీసుకొని ఆయమ్మికి నుదుటికి బొట్టు పెట్టినాడు పక్కీరయ్య.

'రా...రా... నా కొడుకా... నిన్ను అరికాలి కిందవేసి నలుస్తా...రా!' అని ఆయమ్మి పళ్లు పటాపటా కొరుకుతా తిడతా వుండాది. ఆయమ్మిని ఒక ప్రక్క సిద్ధులయ్య, మరో ప్రక్క తిరుమలయ్య పట్టుకొని వుండారు. వీరిద్దరూ పక్కీరయ్యకు ఇష్టమైన శిష్యులు. అందుకే పక్కీరయ్య తనకు తెల్సిన విద్యలన్నీ వీళ్లిద్దరికీ నేర్పించాడు. పక్కీరయ్య చేతిలో యాపాకు మండలు తిరుగుతా వుండాయి.

'పెట్టాకు...రా... ఆ మంత్రం బొట్టు పెట్టాకు... నేను తురక దెయ్యాన్ని... పడితే విడిసిపోను... పెట్టాకు... ఆ బొట్టు పెట్టాకు...' అని గట్టిగా తల విదిలిచ్చుకుంటా మట్టిలో పడి దొర్లుతాంది. పక్కీరయ్య చేతిలోని యాపాకు మండలు పెరుక్కొని ఆకుల్ని నోటితో నములా ఉండాది. చేతులు విదిలించుకుంటా పెనుగులాడతా వుంది. పక్కీరయ్య మాత్రం ఆపకుండా మంత్రాలు చదువుతానే ఉండాడు.

ఆయమ్మి ఎగుర్తాంది. కాళ్లను విదలిస్తాంది. చేతులు పెరుక్కొని మట్టి తీస్కొని విసిరేస్తాంది. 'ఏందిరా నా బట్టల్లారా... నమిలి మింగుతా మిమ్మల్ని...!' అంటా రుద్రరూపం జూపిస్తావుండాది.

'ఓ తురకదెయ్యమా! ఏంటికి పట్టినావు నువ్వు...?' బూడిద ఎగజల్లుతూ అడిగినాడు పక్కీరయ్య.

'నీకెంటికి జెప్పలా... నేను జెప్పను. నీకు చేతనైంది చేసుకోపో...!' తలాడిస్తా చెప్పింది ఆయమ్మి.

పక్కీరయ్య ఆలస్యం చేయకుండా, ముగ్గులోనే పెట్టిన పూజ చేసిన పెద్ద ఇనుపమేకు తీసుకున్నాడు.

నీ తల మీద దీన్ని దిగ్గడతా జూడు'-అందుకున్నాడు.

'సామీ... నీ కాళ్లకు ముక్కుతా...నన్ను యిడిసిపెట్టు...' ఆయమ్మి ప్రాథేయపడతాంది.

'నువ్వేంటికి మా పిల్లకు పట్టినావో మానంగా జెప్పు' గదురుకున్నాడు పక్కీరయ్య.

'ఏం జెప్పేది సామీ... నేను తురకదాన్ని... వూర్లోనే దిగదాల మాలింద్ల కానుకొని వుండే కొట్టాల్లో వుండేదాన్ని. మొగుడు కువైట్ దేశం పోయినాడు. అత్త, నేను ఇద్దరమే వుంటాం. ఇదిగో ఈయమ్మి మొగుడు పాపిరెడ్డి కొడకు ఎంకట్రెడ్డి మా ఇండ్లకాడికి వచ్చేటోడు. వాళ్ల తోటలోకే నేను పనికికూడా పోతా వుంటి. ఓ రోజు మధ్యాహ్నమప్పుడు కానుగచెట్టు కింద పండుకొని వుంటే వచ్చి పట్టుకున్నాడు. 'వద్దు రెడ్డీ...వద్దు రెడ్డీ' అని పెనుగులాడినాను. అయినా విడ్సిపెట్లేదు. అనుభవించి ఆ రోజు కూలీ లెక్కకు ఇంగో ఇరవై రూపాయలు ఎక్కువిచ్చిపోయినాడు. అది మొదలు నేను ఎప్పుడు వాళ్లకు పనికిపోయినా నన్ను వాడుకునేటోడు. పెద్దరెడ్లతో పెట్టుకొని మేం యాడ బతికేది. అందుకే భరిస్తావుంటి. వాని కామానికి నేను తల్లినైనాను. ఆ సంగతి వాడికి జెప్పితే ఏం కాదని చెప్పి నాల్గునెల్ల క్రితం పొలం కాడ్నె మోటారు కరెంటు తీగలు కాళ్లకు చుట్టి సంపి, బావిలోకేసి సప్పినాడు. వూరి జనాన్ని నేను అత్తతో కొట్లాడి బావిలో దూకి చచ్చినట్లు నమ్మించాడు. అందుకే నేను దెయ్యమై వాడి పెండ్లానికే పట్టుకున్నాను' చెప్పింది ఆయమ్మి మరలా ఏడుస్తా!

కొంచెం సేపు నిశ్శబ్దం. చెట్టు చాటు నుంచి చూస్తున్న కొడుకును అసహ్యించుకుంటూ పాపిరెడ్డి దంపతులు తిడుతున్నారు.

'సరే...సరే... తురకదెయ్యమా! అయ్యిందేదో అయ్యింది. దిగు... దిగు... దిగి ఇట్నే జడ ఎంబిడి చివరికి రా... రా... రా... కొసకు... చివరాఖరికి... రా...' అంటూ ఆయమ్మి జడ చివరికి దెయ్యాన్ని తీసుకొచ్చి చివర్లో రోంత వెంట్రుకలు కత్తెరతో తెంచినాడు పక్కీరయ్య.

ఆయమ్మి సోదీనం తప్పి కుప్పకూలిపోయింది.

జడ చివర్లో తెంచిన వెంట్రుకల్ని సీసాలో బోసి గట్టిగా చెక్క మూత బిగించినాడు పక్కీరయ్య. ఆ తర్వాత మూడేప మాన్ల సత్రం దాటుకున్నాక వచ్చే నాలుగు దావల మధ్యలో బారెడు గుంత తీసి బూడ్సినాడు.

'యింగ దెయ్యం రాదు గానీ... ఇదిగో ఆ యాపమాను నడిమి కొమ్ముకు ఈ ఇనుపమేకు దిగ్గొట్టి ఆయమ్మిని పిల్సుకపోండి. చూడు... పాపిరెడ్డీ... యింగనన్న 'మనిషి' అన్న బతకమని నీ కొడుక్కు జెప్పు...' అని హెచ్చరించినాడు పక్కీరయ్య.

సిద్ధులయ్య, తిరుమలయ్య కూడా పక్కీరయ్య వెనుక సత్రం దిశగా అనుసరించినారు.

000

పక్కీరయ్యకు వయస్సు పెరిగే కొద్దీ శరీరం సహకరించడం లేదు. అక్కడికీ ఆకుపసురు వైద్యం చేసుకుంటానే ఉండేటోడు. నడిరాత్రి శూన్యఘడియల్లో శిష్యులిద్దరికీ పొలిమేరలోని శ్మశానంలో మంత్ర తంత్రవిద్యలన్నీ నేర్పించేటోడు. కానీ చివరిగా ఎప్పుడూ ఒక మాట చెప్పేటోడు.

'మీరు విద్యలన్నీ నేర్చుకోండి. నేను పోయినాక ఈ విద్యలే మీకు కూడు పెడతాయి. అయితే మనమూ, మన విద్యలన్నీ మేలు చేసేకే వాడుకోవాలి గానీ కీడు కోసం కాదు. చేతిలో విద్య వుందని, నోట్లో మంత్రముందని మీరు వినాశనానికి పూనుకుంటే మీరు మిగలరు. మన విద్య వల్ల లోకం పచ్చంగుండాల! ఈ మాటలు నాకు మా గురువు జెప్పినాడు. నేను ఆచరించినా. మీరూ పాటించండి. ఇదే నేను మీకు చివరగా జెప్పేది!' అని పక్కీరయ్య సత్రం అరుగు మీద పండుకొని అంటానే కన్ను మూసినాడు.

శిష్యులిద్దరూ గుండెల్ని బాదుకుంటూ దుఃఖించినారు.

ఆ తర్వాత నుంచి అంజన సిద్ధులయ్యనే మంత్రాలు చదివేటోడు, తిరుమలయ్య అంజనంలోకి చూసేవాడు.

ఇట్లాగే కాలం గడుస్తావుండాది.

మిట్టమధ్యాహ్నమప్పుడు భుజాన సంగటి మూట మోసుకుని కాళ్లీడ్చుకుంటా వీరారెడ్డి, సిద్ధులయ్య సత్రం కాడికి వచ్చినాడు. రావడం రావడంతోనే సిద్ధులయ్య పాదాల ముందు సాగిలబడ్డాడు. ఆశీస్సులందుకున్నాడు.

'సంగతేంది వీరారెడ్డి. మళ్లా నీ ఆవులమంద దారి తప్పిందా ఏంది, ఇట్టా వచ్చినావు? నవ్వుతా ప్రశ్నించినాడు సిద్ధులయ్య.


'శానా రోజులైంది కదా సామీ మిమ్మల్ని జూసి. చూసిపోదామని వస్తి...' నసుగుతానే చెప్పినాడు వీరారెడ్డి.

ఆ మాటా ఈ మాటా మాట్లాడుకుంటానే ప్రొద్దు వాలింది. వూరికి యల్లబారేటప్పుడు అసలు సంగతి చెప్పి నాడు వీరారెడ్డి.

తన భార్య లక్ష్మమ్మ ఆవులను తోలుకొని అక్కదేవతల కొండకు పోయినప్పుడు బంగారు ముక్కుపుడక దొరికిందని, చేతిసంచి లోంచి దాన్ని తీసి చూపించినాడు. కళ్లు జిగేల్‌మని మెరిసినాయి ఇద్దరికీ!

'చూస్తాంటే ఇది దేవతాభరణం అన్పిస్తా వుండాది' అన్నాడు, దాన్ని అటు ఇటు తిప్పి జూసి సిద్ధులయ్య.

'అందుకే సామి నేను వచ్చింది... మా పెద్దోళ్ల కాలం నుంచి అంటావుండారు అక్కదేవతల కొండలో నిధి వుండాదని మీరు రొంత నిమ్మళంగా కూకొని అంజనం వేస్తే మన బతుకు బంగార మవుతుంది...'



ప్రాథేయపూర్వకంగా అడిగినాడు వీరారెడ్డి.

'లోకకల్యాణార్థం అంజనవిద్య ఉపయోగించాలి గానీ ఇట్టాటి వాటికి కాదు...' చెట్టు కింద కూర్చుంటా చెప్పినాడు సిద్ధులయ్య.

అప్పుడే చెట్టుమీద ఏదో పక్షి కూత గూడ కూసింది.

'మీబోటి యోగులే మాపై దయపెట్టకుంటే మా జీవితాలు ఎప్పుడు బాగుపడతాయి సామీ...' మొరపెట్టుకున్నాడు వీరారెడ్డి.

'నాకు, నా గురువు, పక్కీరయ్యసామీ విద్య బోధించేటప్పుడే సెలవిచ్చాడు వీరారెడ్డి... నీకు నేర్పిస్తాండే అంజనం విద్య పదిమందికి మేలు చేసేదిగానే ఉండాలి గానీ విపరీతాలకు తావి చ్చేది వుంటే ప్రమాదమని. అందుకే నేనెప్పుడూ ఇట్టాటి ఆలోచన లను కూడా నా తలకాయలోకి రానియ్యను...' వివరంగా చెప్పినాడు సిద్ధులయ్య.

'వుండే భూమంతా వానలు పడక ఎండిపాయె. వూర్లో పచ్చగడ్డి గూడా లేకుండా పాయె. ఆవుల దొక్కలెండిపాయె. ఇంట్లో పెండ్లి చెయాల్సిన ఆడపిల్లోళ్లు నల్గురుండారు. ఇల్లూ, వాకిలి గూడా సరిగ్గా లేవు. ఇంగ దేశాలు పట్టుకొనిపోవాల్సిందే నేనూ, నా కుటుంబం. మీరు రొంత దయదలిస్తే ఆ అంజనం చేసి సూద్దాం... సొమ్ము వుంటే ఉండని... కనీసం ఉందో లేదోనన్న తెలుస్తాది... యింగ మీరే నాకు దిక్కు...' కాళ్ల మీద పడినాడు వీరారెడ్డి. తిరుమలయ్య నిశ్శబ్దంగా ఉండాడు.

చెట్టు మీద పక్షి వింతగా కూస్తూనే ఉండాది.

'సరే... సరే... నీ కోసం చూస్తాను... అక్కదేవతల కొండ పైన నిధిలో రాళ్లుండాయో.. రత్నాలుండాయో...' అంటా పైకి లేసి సత్రంలోకి పోయినవాడు. వెనుకే వీరారెడ్డి గూడా.

నడిరాత్రికంతా ముగ్గు తయారైంది.

'అక్కదేవతల కొండలో పెద్దవీరమల్లమ్మ, సూర్యకన్య, చంద్రకన్య, అగ్నికన్య, మంత్రాల మహాదేవి, నాగమునెమ్మ, చిన్నవీరమల్లమ్మ అక్కదేవతలందరూ కాపలాగా ఉండే పోలేరమ్మ బండ కింద గుప్తనిధి ఉండాది. ఎవరైనా దాన్ని బయటకు తీయాలనుకుంటే నెత్తురు కక్కుకొని తల పగిలి చావల్సిందే...!' కళ్ల నుంచి నీళ్లు కార్చుకుంటా, అంజనం దిక్కు కళ్లు ఆర్పకుండా చూస్తా చెప్పినాడు పిల్లికళ్ల తిరుమలయ్య.

"యింగెట్టా ఆ నిధి బయటకొస్తాది తల్లీ...?' గట్టిగా బూడిద ఎగజల్లుతూ అడిగినాడు సిద్ధులయ్య.

'అమావాస్యనాడు అక్కదేవతలకు శాంతి చేసి ఒక నరబలి ఇస్తే నిధి బయటకు వస్తాది...' తల తిప్పుతా తిప్పుతా గొణిగి మూర్ఛిల్లినాడు తిరుమలయ్య.

ఇంత కాలం నుంచి అంజనమేస్తూనే ఉన్నారు. తిరుమలయ్య చూసి చెప్తానే వుండాడు కానీ మూర్ఛిల్లి పడిపోవడం ఇదే మొదటిసారి. సిద్ధులయ్య పక్కన రాగి చెంబులో ముంచుకొని పెట్టుకొని ఉండే నీళ్లు, తిరుమలయ్య ముఖంపైన చిలకరించినాడు.

కొద్దిసేపటికి తిరుమలయ్య కళ్లు తెరిచాడు.

'ఏమైంది' అన్నట్లు కళ్లు ఎగురేశాడు సిద్ధులయ్య.

'వయసు వస్తా వుండాది కదా. కళ్లు ఆర్పకుండా చూస్తానే ఉండడం కష్టంగా ఉండాది' చెప్పి కుండలో నీళ్లు ముంచుకొని తాగి కట్ట మీద పడుకున్నాడు.

చల్లగా గాలి పెడ్తావున్నా తిరుమలయ్య వొళ్లంతా చమటలు పడ్తావుండాయి.

సిద్ధులయ్యకు కూడా శరీరమంతా నొప్పిగా వుండడంతో నిద్రకు ఉపక్రమించాడు.

వీరారెడ్డి మాత్రం ఆలోచనలోనే ఉండాడు.

**000**

ఉదయాన్నే సగిలేటి పల్లె కాన్నుంచి గొల్లోళ్లు కొందరు వచ్చారు. వూర్లో కొత్తగా కడతావుండే రాముని గుడిలోని విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ విషయం మాట్లాడిపోయినారు. యింగరొంత సేపటికి లావనూరు కాన్నుంచి చిన్నారెడ్డి వాళ్లు వచ్చినారు. వూర్లోని దేవళంలో రాత్రికి రాత్రి దొంగలు పడి, ఏడువారాల నగలు తీసుకపోయినారని లబోదిబోమని ఏకరువు పెట్టినారు. ఆలస్యమైతే దొంగలు దూరంగా పారిపోతారని, వెంటనే అంజనం వేసి చెప్పాలని తొందర చేస్తావుండారు. చేసేదేం లేక ముగ్గులోకి తిరుమలయ్యను కూర్చోబెట్టినాడు. సిద్ధులయ్య మంత్రాలు చదవడం మొదలెట్టినాడు. చేతిలోని యాపాకు మండలు తిరుగుతానే ఉండాయి.

'చెప్పు తల్లీ... చెప్పు... దేవళంలో జరిగిన దొంగతనం... దొంగలు యాడుండారు... చెప్పు తల్లి... చెప్పు...' అడుగుతా వుండాడు సిద్ధులయ్య.

సమాధానం లేదు.

కొద్దిసేపు తర్వాత మళ్లీ అడిగాడు సిద్ధులయ్య.

తిరుమలయ్య కళ్ల నుంచి నీళ్లు కారిపోతావుండాయి.

సమాధానం లేదు.

ఇప్పుడేం చేయాలి?

తిరుమలయ్యకు, కళ్లు మూసుకుంటే చాలు, వీరారెడ్డి ముఖమే కన్పిస్తావుండాది.

అర్థం కావడం లేదు. ఎందుకిలా జరుగుతోంది?

ముగ్గు లోంచి పైకి లేచాడు తిరుమలయ్య, తన వల్లకావడం లేదంటూ!

రేపు ఆదివారం అమావాస్య రోజు అంజనం వేస్తే, కచ్చితంగా తెలుస్తుందని చెప్పి వాళ్లను పంపించివేశాడు సిద్ధులయ్య. కళ్లు మంటగా వుండాయని చెప్పి తిరుమలయ్య అరుగు పైన పండుకన్నాడు.

వీరారెడ్డి అక్కడక్కడే తచ్చాడుతూ ఉండాడు.

మధ్యాహ్నమప్పుడు మండపం పల్లె నుంచి కరువు కటకటలాడిస్తా వుండాది. వానలు ఎప్పుడొస్తాయి? మబ్బులు ఎప్పుడు కనికరించి కురుస్తాయని అడగనొచ్చినారు. వాళ్లని ఆదివారం నాడు రమ్మని సిద్ధులయ్య చెప్పంపినాడు.

నిద్రలో కలవరించుకుంటా ఉలిక్కిపడ్తా వుందని ఈతచెట్లు పల్లె కాన్నుంచి ఓ తల్లి, బిడ్డను చంకనెత్తుకొని వచ్చింది. ఆ బిడ్డకు యాపాకుతో మంత్రించి తాయత్తు కట్టి పంపించినాడు సిద్ధులయ్య.


తిరుమలయ్య అసహనంగానే ఉండాడు.

'సామీ... తెల్లారితే ఆదివారం అమావాస్య... ఈ సాయంత్రానికి బయలుదేరుతేనే కదా... మనం రేపు రాత్రికంతా అక్కదేవతల కొండకు జేరుకొనేది... బయలుదేరుదాం...' తొందరపెడ్తా వుండాడు వీరారెడ్డి.

ఏం జెయ్యాలో అర్థం కావడం లేదు సిద్ధులయ్యకు.

చీకట్లైతావుండాది. వీరారెడ్డి పోరు పడలేక బయలుదేరారు.

అక్కదేవతల కొండంటే ఆషామాషీ కాదు. శేషాచలం కొండల్లో నడిమధ్యన ఉండాది. పులులూ, సింహాలూ వుండాయంటారు. అందుకే అంకిరెడ్డి పెద్ద వేట కొడవలి తీసుకొని నడుస్తావుండాడు ముందుగా.



ఎట్లైతేనే ఏంది... అమావాస్య రాత్రికంతా అక్కదేవతల కొండ చేరినారు. నడిరాత్రి... వంకలో ముగ్గురూ స్నానాలు చేసి వచ్చినారు. పోలేరమ్మ బండపైకి చేరినారు. ముగ్గు తయారైంది. పసుపు, కుంకుమ, యాపాకు మండలు, బూడిద సిద్ధం. తిరుమలయ్య ముగ్గులో కూర్చోని అరచేతిలో అంజనం చుక్క పెట్టుకొని తదేకంగా చూస్తున్నాడు. సిద్ధులయ్య మంత్రాలు జపిస్తూనే ఉండాడు. వీరారెడ్డి వేట కొడవలి భుజాన పెట్టుకొని చుట్టూ కాపలా కాస్తావుండాడు.

తిరుమలయ్య కళ్లల్లోంచి నీళ్లు కారతానే ఉండాయి.

'చెప్పు తల్లీ...చెప్పు...' అదిరిపడేటట్లు అడిగినాడు అంజనయ్య జవాబు లేదు. యాపాకు మండలు తిప్పుతానే ఉండాడు. కుంకాలు జల్లుతానే ఉండాడు. మంత్రాలు-చదువుతానే వుండాడు. 'చెప్పు తల్లీ... చెప్పు...' అని అడుగుతానే వుండాడు. 'రేయ్...' అరిసాడు తిరుమలయ్య. 'నిధి ఎట్లా బయటకొస్తాది తల్లీ-?' అడిగినాడు అంజనయ్య

'ఎట్లొస్తాది...? రేయ్! నరబలి... కావాలిరా... నేనే బయటకొస్తా' తల ఎగురేస్తా రోషంగా జవాబిచ్చినాడు తిరుమలయ్య.

అంకిరెడ్డి ఆలస్యం చేయలేదు, చేతిలోని వేటకొడవలి తిరుమలయ్య తలను ఒక్క వేటుకే నరికింది... అంతే!

**000**

మూదేపమాన్ల సత్రం కాన్నుంచి, కాలిదావన పడమటి దిక్కుకు, బసవేశ్వరుడి దేవళం వైపుకు రాళ్ల గుట్ట దాటుకున్యాక అట్నే అట్నే కవ్వంకోన కాడుండే పెన్నేరు దాటుకున్న తర్వాత, తూర్పుకు దిగితే ఎగువ బండకు అవతల నాలుగు యాపచెట్లు పది తుమ్మచెట్లుండే వనంలో, అప్పుడెప్పుడో దారి తప్పి వీరారెడ్డి ఆవులు జేరుకున్న ఆ వనంలోనే... నిలువెత్తు తుమ్మమాను కొమ్మల్లో శవం వూగుతావుండాది... అవును... అవును... అది... అంజన సిద్ధులయ్యదే!

ఏం జరిగిందో బయటి జనానికి ఏమీ తెలియలేదు.

మంత్రాలేవో వికటించినాయని కొందరు...

అక్కదేవతలు ఆగ్రహించివుంటారని మరి కొందరు...

వీరారెడ్డి చంపించి వుండాడని ఇంకొందరు...

అంజనవిద్యకు ద్రోహం చేశాననుకుని ఆత్మహత్య చేసుకొని వుంటాడని పలువురు...

ఏదేదో అనుకుంటా వుండారు...

నిజమేదో ఎవరికీ తెలియదు...

వీరారెడ్డి మాత్రం ఎదిగిపోయాడు.

రూపాన్నీ, స్వరూపాన్నీ మార్చుకున్నాడు.

మూడు మేడల ఇల్లొకటి లేపినాడు.

పెళ్లాం మెడలో ఎనిమిది పేటల హారం వేసినాడు.

కూతుళ్లకు కోరింది ఇచ్చి కట్టబెట్టినాడు.

పొలం పని, ఆవులమంద అన్ని వదిలేసి, మీసాలు దువ్వుకుంటా, జీతగాళ్లతో వెట్టి చాకిరి చెయించుకుంటా బతుకుతా వుండాడు. పూర్లో లెక్కన్న మొగోడు వీరారెడ్డి.

అందుకే ఆయప్పకు వూరు దాసోహమైంది.

**000**

అంజనం పల్లె కాడి రాయలకాలం నాటి సత్రం బోసిపోయి బోరు బోరున మొత్తుకుంటావుండాది. చుట్టుపక్క యాడే గానీ అంజన మేసి చేసి చెప్పేటోళ్లే లేకుండా పోయినారు. వూర్లల్లో దెయ్యాలు పడితే ఎవరు యిడిపిస్తారు? తప్పిపోయినవాటి ఆనవాళ్లు ఎవరు చెప్పగలరు?

రావిచెట్టు, యాపచెట్టు పెనవేసుకొని వుండే కొమ్మల్లోని పక్షి ఒకటి విషాదంగా కూత పెడతానే ఉంది... చీకటి పాటలాగా!